కొట్లాటలో టీడీపీ నేత భర్త చేతిలో వ్యాపారి హతం

విశాలాంధ్ర-చోడవరం : చోడవరంలో ఇటీవల జరిగిన ఓ తగాదాలో టిడిపి నేత పదో వార్డు మెంబర్ భర్త నేమాల హరి చేతిలో ఓ వ్యాపారి ఇందల సన్యాసిరావు(62) హతమయ్యాడు. దీనిపై పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఈ నెల 3న ఉదయం 09.00 గంటలకు చోడవరంలోని బాలాజీ నగర్ వద్ద ఇందల సన్యాసిరావు, నేమాల హరి మధ్య గొడవ జరిగిందన్నారు. ఆ గొడవలో నేమాల హరి, ఇందల సన్యాసిరావుని బలంగా చేతులతో గుద్ది, కిందకి తోయడము వలన ఇందల సన్యాసిరావు కింద పడి తలకు బలమైన గాయంతో కె.జి.హెచ్‌లో చికిత్స పొందుతూ బుధవారం మరణించినట్లు తెలిపారు. దీనిపై మృతుడు సన్యాసిరావు కుటుంబసభ్యులు ఫిర్యాదు మేరకు ఈనెల 04న కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామన్నారు. సన్యాసిరావు మృతితో కేసును ఆల్టర్ చేసిన చోడవరం ఇన్స్పెక్టర్ ఆధ్వర్యంలో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలియజేశారు.

పదో తరగతి విద్యార్థులకు పరీక్ష సామాగ్రి పంపిణీ

విశాలాంధ్ర-సబ్బవరం : మండలంలోని రావులమ్మపాలెం గ్రామంలో జిల్లా పరిషత్ హైస్కూల్‌లో పదో తరగతి విద్యార్థులకు తొమ్మిదో తరగతి విద్యార్థులు సమకూర్చిన పరీక్ష సామాగ్రి ని స్థానిక సర్పంచ్ సబ్బవరపు నారాయణమూర్తి చేతుల మీదుగా బుధవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 17 వ తేదీ నుండి పది వో తరగతి పరీక్షలు జరుగుతున్న నేపథ్యంలో పరీక్షి సామాగ్రిని విద్యార్థులు సద్వినియోగం చేసుకొని పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలని కోరారు. అనంతరం ప్రధానోపాధ్యాయరాలు వి.అరుణకుమారి మాట్లాడుతూ పదవ తరగతి విద్యార్థులు పరీక్షలు సమీపిస్తుండడంతో ఎటువంటి ఒత్తిడిలకు గురికాకుండా ఆయా సబ్జెక్టులు ఉపాధ్యాయులు ఇచ్చిన ప్రణాళికలు ప్రకారంగా మోడల్ పేపర్లు చదువుకొని పరీక్షలు బాగా రాయాలని కోరారు. ఈ కార్యక్రమంలో రమణ మాస్టారు, పాఠశాల చైర్మన్ సబ్బవరపు కృష్ణ, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరు పాల్గొన్నారు

రాష్ట్ర పండుగగా నూకాంబిక అమ్మవారి జాతర

జీవో విడుదల చేసిన ప్రభుత్వం

విశాలాంధ్ర-అనకాపల్లి : ఉత్తరాంధ్ర ఇలవేల్పు అనకాపల్లి గవరపాలెంలో వెలిసిన శ్రీ నూకాంబిక అమ్మవారి దేవస్థానం ఈ ఏడాది కొత్త అమావాస్య జాతరను రాష్ట్ర పండగ చెయ్యాలని ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా ఆలయంలో జీవో కు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా అమ్మవారి పంచలోహ విగ్రహానికి పాలాభిషేకం నిర్వహించారు, గుడి ఆవరణలో బాణాసంచిక కాల్చి స్వీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో దేవదాయశాఖ ఉపకమిషనర్, ఆలయ ఈవో, ఎన్ సుజాత, పండగ ప్రత్యేక అధికారి కె శోభారాణి, కోటమి పార్టీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు. విలేకరుల ఇళ్ళ స్థలాలపై అసెంబ్లీలో కొణతాల జీవో నెంబర్ 535 పరంగా జర్నలిస్టుకు ఇళ్లస్థల పట్టాలను అందించాలని ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ అసెంబ్లీలో మంత్రిని కోరడం జరిగింది. మంత్రి స్పందిస్తూ తప్పకుండా ఈ విషయాన్ని పరిగణములో తీసుకొని మీడియా మిత్రులకు ఇళ్ల స్థలాలను అందిస్తామని హామీ ఇచ్చారు.

జనసేన ఆవిర్భావ దినోత్సవాన్ని జయప్రదం చేయండి

మండల జనసేన పార్టీ అధ్యక్షులు టెక్కలి పరశురామ్

విశాలాంధ్ర-మునగపాక : ఈనెల 14న పిఠాపురంలో జరగబోవు జనసేన పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు విజయవంతం చేయాలని మండల జనసేన పార్టీ అధ్యక్షులు టెక్కలి పరశురామ్ పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పవన్ కళ్యాణ్ పోరాటం వల్ల రాష్ట్రంలోనే కాదు దేశంలో కూడా ఎన్డీఏ ప్రభుత్వం ఏర్పడిందని, మోడీ కూడా పవన్ కళ్యాణ్ను తుఫాన్ అని ప్రశంసించారని పవన్ కళ్యాణ్ నాయకత్వంలో రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని అన్నారు. యలమంచిలి ఎమ్మెల్యే విజయ్‌కుమార్ ఆదేశాలమేరకు ఈనెల 14న జనసేన పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలకు మునగపాక మండలంలో ఉన్న నాయకులు, జన సైనికులు, వీర మహిళలు పిఠాపురంలో జరిగే సభకు హాజరు అవ్వాలని కోరారు. మునగపాక మండల కార్యాలయం నుండి బస్సులు బయలుదేరుతాయని అలాగే 250 బైకులతో పిఠాపురం బయలుదేరుతున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు సూరిశెట్టి అప్పలనాయుడు పాల్గొన్నారు.

అనకాపల్లిలో వజ్రాభరణాలు ఎగ్జిబిషన్

విశాలాంధ్ర-అనకాపల్లి: పట్టణంలోని విజయా రెసిడెన్సీలో బుధవారం వసుందర జ్యూయలరీ ఆధ్వర్యంలో వజ్రాభరణాల అమ్మకాల ఎగ్జిబిషన్ మాజీ ఎంపీ భీశెట్టి వెంకట సత్యవతి, డాక్టర్ హారికా ముఖ్య అతిధులుగా పాల్గొని ఎగ్జిబిషన్‌ను జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. అనంతరం డాక్టర్ సత్యవతి మాట్లాడుతూ. ఇప్పటివరకు స్వర్ణా భరణాలు మాత్రమే చూశామని, మొట్ట మొదటి సారిగా అనకాపల్లిలో వజ్రాభరణాలు ఎగ్జిబిషన్ వసుందర జ్యూయలరీ ప్రతినిధులు ఏర్పాటు చేయడం హర్షణీయమన్నారు. రెండు రోజుల పాటు జరిగే ఈ కార్యక్రమాన్ని ఈ ప్రాంత ప్రజలంతా సద్వినియోగం చేసుకోవాలని ఆమె పిలుపునిచ్చారు. అనంతరం వసుందర జ్యూయలరి వైస్ ప్రెసిడెంట్ టి.శ్రీదేవి మాట్లాడుతూ. రెండు లక్షలకు పైగా కొనుగోలు చేసిన వారికి ఒక లక్కీ కూపన్ ఇవ్వడం జరుగుతుందని ఈ లక్కీ డిప్ లో గెలుపొందిన వారికి ఒక డైమండ్ రింగ్ బహుమతిగా అందజేస్తామన్నారు. అలాగే ఉమెన్ సపోర్ట్ ఉమెన్ అనే కాన్సెప్ట్ తో ఈ వసుంధర వజ్రాభరణాల ఎగ్జిబిషన్లో ప్రముఖ డిజైనర్ శిరీష చౌదరి సిరి అటెలియర్ అనే పేరుతో మహిళలకు సరికొత్త డిజైన్లతో వస్త్రాభరణాల ప్రదర్శన స్టాల్ ఆకర్షణగా నిలిచింది.

15 ఏళ్లుగా కోట్లాదిమంది గుండెల్లో చిరస్థాయిగా నిలిచిన పార్టీ వైసిపి

వైసిపి రాష్ట్ర కార్యదర్శి బొడ్డేడ ప్రసాద్

విశాలాంధ్ర-మునగపాక : వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ 15 ఏళ్లుగా కోట్లాది మంది గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయిందని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి,అనకాపల్లి జిల్లా మాజీ అధ్యక్షులు బొడ్డేడ ప్రసాద్ అన్నారు.స్థానిక నందీశ్వర కళావేదిక ప్రాంగణంలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవ సందర్భంగా వైయస్సార్ విగ్రహానికి పూలమాల వేసి ఘన నివాళు లర్పించారు.ఈ సందర్భంగా ప్రసాద్ మాట్లాడుతూ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి ఆదేశాలకు అనుకూలంగా భవిష్యత్తులో పార్టీని ప్రతిష్టం చేసే చర్యలు చేపడతామన్నారు.జగనన్న బడుగు,బలహీన వర్గాల సంక్షేమం కోసమే వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఆవిర్భవించడం జరిగిందన్నారు. మోసపూరితమైన హామీలు ఇచ్చారని,వాటిని అమలు చేసే పరిస్థితుల్లో కూటమి ప్రభుత్వం లేదని ఆయన అన్నారు.ఈ కార్యక్రమంలో జడ్పిటిసి పెంటకోట స్వామి సత్యనారాయణ,మండల వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఆడారి గణపతి అచ్చియ్యనాయుడు, ఎంపీటీసీ మద్దాల వీరునాయుడు, మాజీ ఎంపీపీ దాసరి అప్పారావు, అరబుపాలెం గ్రామ సర్పంచ్ బొడ్డేడ శ్రీనివాసరావు, తిమ్మరాజుపేట గ్రామ ఉపసర్పంచ్ కాండ్రేగుల జగన్, ఎస్.రమణమ్మ వైసీపీ నాయకులు,కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

పెదముషిడివాడలో సిండికేట్‌గా గ్రావెల్ దోపిడీ

- పిర్యాదులున్నా పట్టించుకోని అధికారులు

విశాలాంధ్ర-పరవాడ : పరవాడ మండలం పెదముషిడివాడలో గ్రావెల్ మాఫియా రెచ్చిపోతోంది. మట్టిదొంగలంతా ఒక్కటై నిత్యం అక్రమ తవ్వకాలకు పాల్పడుతున్నారు. ఒకప్పుడు పార్టీల వారీగా కొనసాగిన గ్రావెల్ దోపిడీ ప్రస్తుత కూటమి ప్రభుత్వంలో అంతా సిండికేట్ గా ఏర్పడి కొండలు, గుట్టలు, చెరువులను కొల్లగొట్టేస్తున్నారు. ఓ పక్క ఆక్రమణలు మరోపక్క గ్రావెల్ అక్రమ దోపిడి విచ్చల విడిగా జరుగుతున్నా అధికారి యంత్రాంగం మామూళ్ల మత్తులో మునిగి తేలుతున్నారు. ఈ అక్రమంగా తరలించిన గ్రావెల్, మట్టిని పంచాయతీలో జరుగుతున్న భూకబ్జాలకు వినియోగిస్తున్నారు. ఇంత జరుగుతున్నా రెవెన్యూ అధికారులు కానీ, పోలీసులు కానీ, మైనింగ్ అధికారులు కానీ ఎవరు అటువైపు కన్నెత్తి చూడకపోవడం అనేక విమర్శలకు తావిస్తోంది. పగలు అడపా దడపా జరుగుతున్న ఈ అక్రమ గ్రావెల్ దోపిడీ రాత్రివేళల్లో మరింత రెట్టింపవుతోంది. గ్రావెల్ తరలించే సమయంలో ఆయా శాఖాధికారులకు ఫోన్ చేసినప్పటికీ కనీసం పట్టించుకోవడం లేదు. రెవెన్యూ అధికారులైతే అస్సలు స్పందించకపోగా పోలీసులూ సరిగా స్పంధించడం లేదన్న విమర్శలు కూడా ఉన్నాయి. పైగా గ్రావెల్ దొంగలతో కొందరి కిందస్థాయి సిబ్బంది రిలేషన్ కొనసాగిస్తున్నట్లు ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. ఇక మైన్స్ అధికారులైతే ఉన్నారో లేదో ఎవరికీ తెలియదు. దీనికంతటికీ నెలవారీ ముడుపులే కారణమని తెలుస్తోంది. ఇప్పటికైనా జిల్లా రెవిన్యూ, మైన్స్, పోలీస్ ఉన్నతాధికారులు స్పందించి పెదముషిడివాడలో జరుగుతున్న అక్రమ గ్రావెల్, మట్టి తవ్వకాలకు అడ్డుకట్ట వేయాలని స్థానికులు కోరుతున్నారు.

ఉపాధి హామీ పథకం ద్వారా మొక్కలు నాటే కార్యక్రమం

విశాలాంధ్ర-మునగపాక : మండలంలో మూలపేట గ్రామంలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా గ్రామంలో ముఖ్యమైన ప్రదేశాలలో, మెయిన్ రోడ్డు నుండి గంగాలమ్మ గుడి వద్దకు వెళ్లే దారిలో గ్రామ సర్పంచ్ బీసెట్టి గంగ అప్పలనాయుడు, కుటమి నాయకులు బీసెట్టి నాగేశ్వరరావు, ఎల్లపు రాజేశ్వరరావు, శరగడం నాగేశ్వరరావు చేతుల మీదగా కొబ్బరి మొక్కలను వేయడం జరిగింది. యలమంచిలి శాసనసభ్యులు సుందరపు విజయ్ కుమార్ సహకారంతో గ్రామాన్ని మరింత అభివృద్ధి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్ గోవింద్,శరగడం లీలా,ఎల్లపు ఝాన్సీ,గ్రామ పెద్దలు ఎల్లపు నాయుడు, బీశెట్టి వీరి నాయుడు,బీ.వెంకట అప్పారావు, ఉపాధి కూలీలు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు ఎ-గ్రేడ్ ప్రధానం

విశాలాంధ్ర -సబ్బవరం : మండలంలోని స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు ఎ-గ్రేడ్ లభించినట్లు ప్రిన్సిపాల్ డా.బి.సీతాలక్ష్మి తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 2023 మరియు 2024వ సంవత్సరానికి సంబంధించిన కళాశాల కార్యనిర్వహణ, పరిపాలనకు సంబంధించి అకడమిక్ ఆడిట్ కమిటీ తనిఖీలు నిర్వహించా రన్నారు. ఈ సందర్భంగా కళాశాలలో గల అధ్యాపకుల నుండి కార్యనిర్వాహన మరియు పరిపాలనపై తనిఖీలు నిర్వహించారని, అనంతరం విద్యార్థులతో అకడమిక్ ఆడిట్ అధికారులు ముఖాముఖీ సమీక్షలు నిర్వాహించి సంతృప్తి వ్యక్తం చేసారన్నారు. తనిఖీలలో లభించినటువంటి ఆధారాలతో కళాశాలకు ఏ-గ్రేడ్ ఇవ్వడం జరిగిందని తెలిపారు. ఈ తనిఖీలకు కమిటీ సభ్యులు ప్రభుత్వ డిగ్రీ కళాశాల చోడవరం ఆంగ్ల అధ్యాపకుడైన డాక్టర్ కే.మల్లిబాబు మరియు ప్రభుత్వ డిగ్రీ కళాశాల నర్సీపట్నం రాజేంద్రప్రసాద్ వారి ఆధ్వర్యంలో జరగాయి. ఈసందర్భంగా కళాశాల ఎ-గ్రేడ్ సాధించినందుకు ప్రిన్సిపల్ డాక్టర్ బి సీతాలక్ష్మి హర్షం వ్యక్తం చేసారు.

ఉపాధి కూలీలకు వంద రోజులు పని కల్పించాలి

విశాలాంధ్ర-మాకవరపాలెం : ఉపాధి కూలీలకు వంద రోజులు పని కల్పించాలని మాకవరపాలెం ఎంపీడీవో సీతామహాలక్ష్మీ సిబ్బందిని ఆదేశించారు. మండలంలోని బూరుగుపాలెంలో జరుగుతున్న ఉపాది పనులను బుధవారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. గిట్టుబాటు కూలీ వచ్చేందుకు చేయాల్సిన పనుల కొలతలను కూలీలకు వివరించారు. నూతనంగా నిర్మించిన ఫారం పాండును పరిశీలించి, సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది విఆర్పి పాల్గొన్నారు.

అవంతిలో రాష్ట్రస్థాయి చెస్ పోటీలు

విశాలాంధ్ర-మాకవరపాలెం : స్థానిక అవంతి ఇంజనీరింగ్ కళాశాలలో రాష్ట్రస్థాయి చెస్ పోటీలు మార్చి 16వతేది ఆదివారం ఉదయం 9 గంటల నుండి సాయంత్రం ఆరు గంటల వరకు ప్రగతి చెస్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరుగును. ఈ సందర్భంగా బుధవారం అవంతి ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ మోహన్‌రావు గారిచే గోడపత్రికను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమం అనకాపల్లి చెస్ అసోసియేషన్, స్టేట్ చెస్ అసోసియేషన్ సహాయ సహకారాలతో రూరల్ ఏరియాలో విద్యార్థుల ప్రతిబను వెలికి తీయాలని ఉద్దేశంతో ఈ చెస్ పోటీలు నిర్వహిస్తున్నట్లు, ఈ కార్యక్రమంలో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులు పాల్గొనడానికి ఉత్సాహ పడుతున్నారు అని అసోసియేషన్ వారు తెలిపారు. సంప్రదించవలసిన ఫోన్ నెంబర్ 9676514520.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

విశాలాంధ్ర-యస్.రాయవరం: మండలంలోని పెనుగొల్లు గ్రామ సమీపంలో బుధవారం మధ్యాహ్నం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక వ్యక్తి మృతి చెందారు. స్థానిక ఎస్సై ఏ.విభూషణరావు అందించిన వివరాలు ప్రకారం పెనుగొల్లు గ్రామానికి చెందిన చందక రాము (58)అనే వ్యక్తి నక్కపల్లి నుంచి పెనుగొల్లు వైపు జాతీయ రహదారిపై వస్తు మరో దారికి దాటే సమయంలో సమయంలో మరో ద్విచక్ర వాహనం అతివేగంగా వచ్చి ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వెల్లడించారు.

స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలు సద్వినియోగం చేసుకోవాలి

మండల విద్యాశాఖాధికారి కే.నరేష్

విశాలాంధ్ర-నక్కపల్లి : మండల పరిధిలో అందరు ఉపాధ్యాయులు శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకోవాలని మండల విద్యాశాఖాధికారి కె.నరేష్ అన్నారు. బుధవారం చినదొడ్డిగల్లు హైస్కూల్ లో జరిగిన సమావేశాలను ఆమె ప్రారంభించారు. మండల పరిధిలో నక్కపల్లి, చినదొడ్డిగల్లు, వేంపాడు, గొడిచర్ల లలో జరిగిన శిక్షణ తరగతులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రాథమిక/ ఉన్నత పాఠశాలల్లో తరగతిగదిలో ఉపాధ్యాయులు అనుసరించాల్సిన బోధనాపద్ధతులను, బోధనోపకరణాలను తయారుచేసుకుని ప్రదర్శనగా ఉంచాలన్నారు నూతన బోధనాపద్ధతులను, వాటిలో మెలకువలను మెరుగుపరచుకోవడానికి ఈశిక్షణా తరగతులు ఉపయోగపడతాయన్నారు. ఉపాధ్యాయులు బాధ్యతతో, అంకితభావంతో పనిచేయాలని, దానికి అవసరమైన బోధనాభ్యసనాలను, లెస్సన్ ప్లాన్లును తయారుచేసుకుని సమర్థవంతంగా బోధించాలన్నారు.ఈ శిక్షణ తరగతులలో రిసోర్స్ పర్సన్ లు, ఉపాధ్యాయుల బోధనలో మెరుగైన ఫలితాలను సాధించేలా చర్చ జరగాలన్నారు. వీటికి సంబంధించిన వీడియోలను ఐఎఫ్‌పి పానల్ ద్వారా వీక్షించాలన్నారు. మారిన నూతన విద్యావిధానంలో ఈ కాంప్లెక్స్ సమావేశాలు ఎంతో ఉపయోగకరమన్నారు. చినదొడ్డిగల్లులో జరిగిన కార్యక్రమంలో హెచ్.ఎమ్. బి.కవిత, కాంప్లెక్స్ పరిశీలకులు డి.సత్యారావు, లతోపాటు రిసోర్స్ పర్సన్‌లుగా ఎస్.వి.ఎస్. ఆచార్యులు, కళ్యాణి, శ్రీనివాసరావు, శేఖర్, మైమున్నీషా, అచ్చిరాజు, వై.వి.రమణ,నానాజీ , రవి, సీ.ఆర్.పీ శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

అసంపూర్తి గృహ నిర్మాణాల కోసం అదనపు ఆర్థిక సాయం : కలెక్టర్ విజయ కృష్ణన్

విశాలాంధ్ర బ్యూరో-అనకాపల్లి : జిల్లాలో అసంపూర్తిగా ఉన్నఇళ్ల నిర్మాణంపూర్తి చేయుటకు రాష్ట్ర ప్రభుత్వం అదనపు ఆర్థిక సహాయం అందిస్తున్నట్లు జిల్లా కలెక్టరు విజయ కృష్ణన్ తెలిపారు. అదనపు ఆర్థిక సహాయం వినియోగించుకొని ఇంటి నిర్మాణాలను పూర్తిచేసుకోవాలని జిల్లా కలెక్టరు తెలిపారు. ప్రధానమంత్రి ఆవాస్ యోజన పథకం క్రింద ఎస్సీ, బీసీ, ఎస్టీ, పివిటిజి లబ్ధిదారులకు గృహాలు మంజూరై వివిధ దశల్లో అసంపూర్తిగా నిర్మాణంలో ఉన్నలబ్దిదారులకు ఈ అదనపు ఆర్థిక సహాయం అందజేయబడుతుందని తెలియజేసారు. స్వర్ణాంధ్ర విజన్ 2047 లక్ష్యంలో భాగంగా 2029 నాటికి 'అందరికీ ఇళ్లు' నిర్మించాలనే లక్ష్యంలో భాగంగా వివిధ దశలలో నిర్మాణంలో ఉన్న ఇళ్ల నిర్మాణం పూర్తి చేయుటకు ప్రస్తుత యూనిట్ విలువ 1.80 లక్షల రూపాయలకు అదనంగా ఎస్సీ, బీసీలకు 50 వేలు, ఎస్టీలకు 75 వేలు, పివిటీజీలకు లక్ష రూపాయలు చొప్పున అదనపు మొత్తాన్ని ప్రభుత్వం మంజూరు చేసినట్లు తెలిపారు. అనకాపల్లి జిల్లాలో ప్రస్తుతం 17,749 గృహాలు నిర్మాణ దశలో ఉన్నాయని, వీటిలో ఎస్సీ, ఎస్టీ, బీసీలకు సంబంధించి 13,548 మంది లబ్దిదారులకు 70.04 కోట్ల రూపాయలు అదనపు ఆర్థిక సహాయం అందచేస్తారని చెప్పారు. జిల్లాలో మే నెలాఖరు నాటికి 13,687 గృహాలు పూర్తి చేసేందుకు లక్ష్యాన్ని నిర్దేశించుకున్నట్లు తెలిపారు. లబ్ధిదారులు కూడా ప్రభుత్వం అందిస్తున్న ఈ అదనపు ఆర్థిక లబ్ది సదవకాశాన్ని వినియోగించుకొని సొంతింటి కల సాకారం చేసుకోవాలని కలెక్టర్ కోరారు.

ఎన్నికల ప్రక్రియ బలోపేతానికి సలహాలివ్వండి

రాజకీయ పార్టీలకు కేంద్ర ఎన్నికల సంఘం లేఖ

ఏప్రిల్ 30లోగా సూచనలు, సలహాలకు ఆహ్వానం

విశాలాంధ్ర-అనకాపల్లి కలెక్టరేట్ : భారత రాజ్యాంగ చట్టాలకు అనుగుణంగా ఎన్నికల ప్రక్రియను మరింత బలోపేతం చేయడానికి పార్టీ అధ్యక్షులు, సీనియర్ నాయకులనుండి భారత ఎన్నికల సంఘం సలహాలు, సూచనలు ఆహ్వానిస్తోందని భారత ఎన్నికల సంఘం ఒక ప్రకటనలో తెలిపింది. ఈ మేరకు ఒక ప్రకటనను కేంద్ర ఎన్నికల సంఘం నుండి జిల్లా ఎన్నికల అధికారులకు పంపినట్లు జిల్లా కలెక్టరు మరియు జిల్లా ఎన్నికల అధికారి విజయ కృష్ణన్ తెలిపారు. ఎన్నికల రిటర్నింగ్ అధికారి, జిల్లా ఎన్నికల అధికారి, ప్రధాన ఎన్నికల అధికారి స్థాయిలో పరిష్కారం కాని ఏవైనా సమస్యల కోసం భారత ఎన్నికల సంఘం ఏప్రిల్ 30 నాటికి అన్ని జాతీయ, రాష్ట్ర రాజకీయ పార్టీల నుండి సలహాలు, సూచనలను కోరిందన్నారు. రాజకీయ పార్టీలకు జారీ చేసిన లేఖలో, ఎన్నికల చట్టాలకు అనుగుణంగా ఎన్నికల ప్రక్రియలను మరింత బలోపేతం చేయడానికి, పరస్పరం అనుకూలమైన సమయంలో పార్టీ అధ్యక్షులు, పార్టీ సీనియర్ సభ్యులతో సంభాషణను కూడా కమిషన్ నిర్వహించనున్నట్లు తెలిపిందన్నారు. గత వారం జరిగిన భారత ఎన్నికల సంఘం సమావేశంలో, ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల ప్రధాన ఎన్నికల అధికారులు, జిల్లా ఎన్నికల అధికారులు, ఎన్నికల రిటర్నింగ్ అధికారులను రాజకీయ పార్టీలతో క్రమం తప్పకుండా సంభాషణలు నిర్వహించాలని, అటువంటి సమావేశాలలో వచ్చిన ఏవైనా సూచనలను ఇప్పటికే అమలులో ఉన్న చట్టపరమైన చట్రంలో ఖచ్చితంగా పరిష్కరించాలని, 2025 మార్చి 31 నాటికి తీసుకున్న చర్యల నివేదికను కమిషన్ కు సమర్పించాలని ఆదేశించినట్లు తెలిపారు. ప్రజాప్రాతినిధ్య చట్టం 1950,1951, ఓటర్ల నమోదునియమాలు 1960, ఎన్నికల నిర్వహణ నియమాలు ప్రవర్తన 1961, సుప్రీంకోర్టు ఆదేశాలు, భారత ఎన్నికల కమిషన్ ఎప్పటికప్పుడు జారీ చేసిన సూచనలు, మాన్యువల్, హ్యాండ్ బుక్ లు ఇసిఐ వెబ్ సైట్ లో అందుబాటులో ఉన్నాయి. స్వేచ్ఛగా, నిష్పాక్షికంగా ఎన్నికలు నిర్వహించడానికి వికేంద్రీకృత, బలమైన పారదర్శక చట్టపరమైన చట్రాన్ని ఏర్పాటు చేయడం జరిగిందని కమిషన్ రాజకీయ పార్టీలకు రాసిన లేఖలో తెలిపిందన్నారు.

ఎడ్లవీధిలో 5సెంట్ల పంచాయతీ స్థలం కబ్జా...!

- అక్రమంగా ప్రహరీ గోడ నిర్మాణం
- అంబేద్కర్ కాలనీ వాసులు మండిపాటు
- కబ్జాలపై అధికారులకు ఫిర్యాదు చేసిన కాలనీ వాసులు

విశాలాంధ్ర-చోడవరం : చోడవరం మేజర్ పంచాయతీ పట్టణ పరిధిలో ఎడ్ల వీధి అంబేద్కర్ కాలనీ దగ్గర చెరువు గట్టును ఆనుకొన్న పంచాయతీ స్థలములో అక్రమ నిర్మాణం చేయుడమే కాకుండా ప్రభుత్వ మంచి నీటి బోరును కూడా కబ్జా చేయుడము పై కాలనీ నివాస వాసులు తీవ్ర అభ్యంతరం తెలుపుతూ బుధవారం మీడియా కు సమాచారం అందజేసారు. దీనితో తీగ లాగితే డొంక అంతా కదిలింది అన్నట్లుగా భూ కబ్జాలు వెలుగులోకి వస్తున్నాయి. వివరా ల్లోకి వెళితే, ఎడ్లవీధి చెరువు గట్టు కు ఆనుకొని, అంబేద్కర్ కాలనీ పంచాయతి స్థలం లో పూర్వం మంచి నీరు, నుయ్యి చాలా పెద్దది ఉండేది. అక్కడే స్నానాలు చేసేవారు, చాలా మంది మంచి నీళ్లు తాగేవారు. తరువాత ఆ నుయ్యి ని కప్పేసారు. కప్పిన స్థలం సుమారు 5 సెంట్లు ఉంటుంది. దానిని టీడీపీ నాయకులు అండతో ఆ స్థలములో ప్రహరీ గోడ నిర్మాణం అక్రమంగా కట్టేసారు. మధ్యలో గవర్నమెంట్ బోరు కలిపి కబ్జా చేసారని కాలనీ వాసులు గుట్టు రట్టు చేశారు. ఆ స్థలం సర్వే నెంబర్ 66/157/7, ఈర్లె కుటుంబ వాళ్లది కాదని ఇటీవల అధికారిక లెక్కల్లో తేలిపోయింది. అయితే ఇటీవల కాలములో టీడీపీ అధికారం రావటం తో మాజీ టీడీపీ ఎం.పీ.టీ.సీ ఈర్లె శ్రీను అండతో కబ్జారాయుళ్లు అక్రమ నిర్మాణం చేసేసారు. కాలనీ వాసులు ఈ అక్రమ నిర్మాణం, మంచి నీరు బోర్ కబ్జా అంటూ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. దీని పై సంబంధిత అధికారుల దృష్టికి తీసుకు వెళ్తామని కాలని వాసులు చెబుతున్నారు. కబ్జారాయుళ్లపై చర్యలు తీసుకోవాలని, పంచాయతీ, రెవెన్యూ ప్రభుత్వ స్థలాలను కాపాడవలసిందిగా అధికారులను వారు కోరుతున్నారు.

జిల్లాలో 219 మంది జర్నలిస్టులకు అక్రిడిటేషన్ రెన్యువల్ ప్రతిపాదనలకు ఆమోదం

విశాలాంధ్ర-అనకాపల్లి : కలెక్టర్, జిల్లా అక్రిడిటేషన్ కమిటీ చైర్మన్ విజయ క్రిష్ణన్ వారి ఆదేశాల మేరకు జిల్లాలో ప్రింట్ & ఎలక్ట్రానిక్ మీడియా సంస్థలలో విధులు నిర్వహించుచున్న 219 మంది జర్నలిస్టులకు సంబంధించి అక్రిడిటేషన్ రెన్యువల్ ప్రతిపాదనలను ఆమోదించడం జరిగిందని జిల్లా రెవిన్యూ అధికారి వై.సత్యనారాయణరావు తెలిపారు. కలెక్టరేట్లోని తన ఛాంబర్‌లో బుధవారం డిస్ట్రిక్ రెవెన్యూ అధికారి ఆధ్వర్యంలో జిల్లా అక్రిడిటేషన్ కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా రెవెన్యూ అధికారి వై. సత్యన్నారాయణరావు మాట్లాడుతూ జిల్లాలో విధులు నిర్వహిస్తున్న జర్నలిస్టుల సంబంధించిన విషయాలను చర్చించడం జరిగిందని, ప్రభుత్వ ఆదేశాల మేరకు డైరెక్టర్ ఐఎన్‌పిఆర్ వారి ఉత్తర్వులను అనుసరించి అక్రిడేషన్ కలిగి నేటికీ ఆయా సంస్థల్లో పనిచేయుచున్న మీడియా ప్రతినిధుల వివరాలు మీడియా సంస్థల యాజమాన్యాల నుండి డిపిఆర్ఓ కార్యాలయానికి నేటి వరకు అందిన లేఖల ద్వారా 219 మంది ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులకు మరో మూడు నెలలకు (1-3-2025 నుండి 31-5-2025 వరకు) అక్రిడేషన్ రెన్యువల్ కు ఆమోదం తెలపడం జరిగిందని తెలిపారు. కమిటీ సభ్యుల అభ్యర్థన మేరకు ఇప్పటివరకు రెన్యువల్‌కి లేఖలు అందజేయని మీడియా సంస్థలు లేఖలు అందజేయడానికి ఈనెల 20 ఆఖరి గడువుగా నిర్ణయిస్తూ అవకాశం కల్పిస్తున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో కమిటీ సభ్యులు కె.చంద్రరావు, వి.లోవరాజు, టి.రమేష్, హౌసింగు పథక సంచాలకులు వై. శ్రీనివాస్, వై.ఎస్.ఆర్.ఆరోగ్యశ్రీ ట్రస్ట్ జిల్లా కో ఆర్డినేటర్ రంజిత్, ఆర్.టి.సి, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

పోస్కో చట్టంపై అవగాహన పెంచుకోండి

సీనియర్ సివిల్ జడ్జి పి.విజయ

విశాలాంధ్ర-యస్.రాయవరం : మహిళలు చిన్నపిల్లలపై నేరాలు నియంత్రించే విధంగా తీసుకొచ్చిన పోస్కో చట్టంపై అవగాహన పెంచుకోవాలని ఎలమంచిలి సీనియర్ సివిల్ జడ్జి టి.విజయ అన్నారు. మండలంలో అడ్డరోడ్డులో ఉన్న శ్రీ ప్రజ్ఞ జూనియర్ కాలేజీలో మండల లీగల్ సర్వీసెస్ అథారిటీ ఆధ్వర్యంలో మహిళలు చిన్నపిల్లలు పై నేరాలు పోస్కో చట్టంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజల రక్షణ కోసం తీసుకొస్తున్న చట్టాలు పై అవగాహన పెంచుకొని ఎక్కడైనా నేరాలు జరిగితే సంబంధిత శాఖలకు తెలియజేయాలని అన్నారు .ముఖ్యంగా కళాశాల స్థాయిలో పిల్లలు ఇటువంటి వాటిపై అవగాహన చేసుకుంటే గ్రామాలలోని ప్రజలకు వివరించడానికి అవకాశం ఉంటుందని సూచించారు. ఎవరికైనా ఏ సమస్య వచ్చినా తమ దృష్టికి తీసుకురావచ్చని అన్నారు .ఈ కార్యక్రమంలో సిఐ ఎల్ .రామకృష్ణ ,ఎస్సై ఏ. విభూషణరావు ,ఎలమంచిలి బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ నూకరాజు ,లోక్ అదాలత్ సభ్యుడు పీవీ రమణ, ప్రజ్ఞా కాలేజ్ ప్రిన్సిపల్ ప్రసన్న కుమార్, ఏ జి పి డి. వెంకట్రావు ,బార్ అసోసియేషన్ సెక్రటరీ బి .హరి శంకర్ రావు, ప్యానల్ న్యాయవాది టీ .నూకరాజు తదితరులు పాల్గొన్నారు.

రోలుగుంటలో సీసీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం

విశాలాంధ్ర-రోలుగుంట : మండల కేంద్రంలో మట్టి రోడ్ల రూపురేఖలు మారుతున్నాయి. ఎమ్మెల్యే కె.ఎస్.ఎన్ రాజు కారణంగా ఎన్ఆర్ఈజీఎస్ నిధులు రూ.26 లక్షలు, పంచాయితీ ఆర్థిక 15వ సంఘం నిధులతో సీసీ రోడ్ల నిర్మాణానికి ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు ఎంపీటీసీ సుర్ల రామకృష్ణ తెలిపారు. ఈ సందర్భంగా రోడ్డు నిర్మాణ పనులను బుధవారం ప్రారంభించారు. దీంతో పనులు చురుగ్గా సాగుతున్నాయి. రోడ్డు నిర్మాణ పనుల్లో భాగంగా ఎంపీటీసీ సుర్ల రామకృష్ణ మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధియే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ రాష్ట్ర అభివృద్ధి కోసం అహర్నిశలు శ్రమిస్తున్న తీరుపై ఆయన కొనియాడారు. ప్రభుత్వం నిధులు మంజూరు చేయడంతో ఎట్టకేలకు రహదారి కష్టాలు తీరుతున్నాయని ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

వడదెబ్బ తగలకుండా జాగ్రత్తలు తీసుకోవాలి డా.సీతారామలక్ష్మి

విశాలాంధ్ర-మాకవరపాలెం :వేసవి కాలంలో వడదెబ్బ తగలకుండా అవసరమైన జాగ్రత్తలు తీసుకోవాలని మాకవరపాలెం పీహెచ్సీ డాక్టర్ సీతారామలక్ష్మి ప్రజలకు సూచించారు. ఈ సీజన్లో వదులుగా లేత రంగు కాటన్ దుస్తులు ధరించాలన్నారు. ప్రతిరోజు తగినంత నీరు తీసుకోవాలని, ఆహారంతో పాటు కొబ్బరి నీరు, మజ్జిగ, నిమ్మరసం వాడాలన్నారు. మధ్యాహ్నం 12 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు బయట తిరగకుండా ఉండాలన్నారు. బయటకు వెళ్ళేటప్పుడు వాటర్ బాటిల్ పట్టుకోవాలన్నారు.

ఘనంగా వైఎస్ఆర్ పార్టీ ఆవిర్భావ దినోత్సవం

విజయవంతంగా వైసిపి యువత పోరు
కూటమి ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఆందోళనలు

విశాలాంధ్ర-అనకాపల్లి : అనకాపల్లి కలెక్టరేట్ వద్ద ఆందోళన చేపట్టిన వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆడుతున్న కూటమి ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఆందోళన చేపట్టి కలెక్టర్కి వినతిపత్రం అందించిన అనకాపల్లి జిల్లా పార్టీ అధ్యక్షులు బూడి ముత్యాలనాయుడు, అనకాపల్లి నియోజకవర్గ వైస్సార్సీపీ సమన్వయకర్త మలసాల భరత్ కుమార్, మాజీ పార్లమెంట్ సభ్యురాలు బీశెట్టి సత్యవతి, మాజీ యలమంచిలి శాసనసభ్యులు ఉప్పలపాటి వెంకటరమణ మూర్తి రాజు ,మాజీ చోడవరం శాసనసభ్యులు కరణం ధర్మశ్రీ, మాజీ పెందుర్తి శాసనసభ్యులు అన్నంరెడ్డి అదీప్ రాజు, మాజీ నర్సీపట్నం శాసనసభ్యులు పెట్ల ఉమా శంకర్ గణేష్, మాజీ శాసనసభ్యులు కంబాల జోగులు, మాడుగుల నియోజకవర్గ సమన్వయకర్త ఈర్లె అనురాధ ,మాజీ గవర కార్పొరేషన్ చైర్మన్ బొడ్డేడ ప్రసాద్, మాజీ పార్లమెంట్ పరిశీలకులు శరగడం చిన్నఅప్పలనాయుడు పాల్గొని మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం తప్పుడు వాగ్దానాలతో ప్రజలను మోసం చేసింది..ఎన్నికల సమయంలో హామీ ఇచ్చి నేడు ఒక్క హామీ ను కూడా నెరవేర్చ లేదు.జగన్ సీ.ఎం గా ఉన్న సమయంలో నాడు నేడు ద్వారా విద్యా వ్యవస్థ ను సమూల మార్పులు చేశారు. ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులకు బైజూస్, ట్యాబ్ లు అందించారు. డాక్టర్ కావాలన్న విద్యార్థులకు ఫీజు రీయింబర్స్మెంట్ ఇచ్చేవారు. నేడు కూటమి అంతకంటే ఎక్కువ చేస్తామని చెప్పింది..నేటి వరకు ఇచ్చిన 700 కోట్లు.. కానీ కావాల్సింది 4వేల కోట్ల రూపాయలు బడ్జెట్ లో కూడా తక్కువ కేటాయించారు. విద్యార్థులు చదువులు మానుకునే పరిస్థితి నెలకొంది. జగన్ మోహన్ రెడ్డి ఆదేశాలతో నేడు కలెక్టర్ వద్ద ఆందోళన చేసి,కలెక్టర్ కి వినతిపత్రం అందచేశాము.యువతకు ఉద్యోగం వచ్చేవరకు 3వేలు నిరుద్యోగ భృతి కల్పిస్తామని అన్నారు...నేటికి ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదు. కూటమి ప్రభుత్వం దగా చేస్తుంది.జగన్ 15 మెడికల్ కాలేజీలు కట్టాలని నిర్ణయించారు.. ఇందులో 5 కాలేజీ పూర్తి చేశారు..కానీ నేడు మెడికల్ కాలేజీలను ప్రైవేట్ పరం చేస్తామన్నారు.దీని మీద విద్యార్థులు తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారని తెలిపారు.ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, నాయకులు,కార్యకర్తలు,మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేసారు.

సబ్బవరం : వైయస్ రాజశేఖర్ రెడ్డి ఆశయ సాధనాలు కోసమే ఏర్పడి నటు వంటి పార్టీ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అని పెందుర్తి నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే అన్నం రెడ్డి రాజు స్పష్టం చేశారు. మండల కేంద్రంలోని స్థానిక మూడు రోడ్లు కూడా స్థానిక వైయస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహం వద్ద బుధవారం మండల వైసీపీ పార్టీ అధ్యక్షుడు కర్రి బాబు, వైసిపి నేతలు ఆధ్వర్యంలో నిర్వహించిన వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ 15వ అవిర్భావ దినోత్సవం వేడుకలు కు మాజీ ఎమ్మెల్యే అదీప్ రాజు ముఖ్యఅతిథిగా పాల్గొని ముందుగా వైయస్ రాజశేఖర్ రెడ్డికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించి, పార్టీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం కేక్ కట్ చేసారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైయస్ రాజశేఖర్ రెడ్డి పాదయాత్ర చేసిన రోజు ప్రజల సమస్యలు తెలుసుకుని వాటిని నెరవేర్చేందుకు అహర్నిశలు పాటుపడిన మహా వ్యక్తి అన్నారు.ఆయన మరణానంతరం వైయస్ జగన్మోహన్ రెడ్డి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కేవలం రాజకీయ లబ్ధి కోసం కాకుండా తన తండ్రి ఆశయ సాధన కోసమే అహర్నిశలు కష్టపడి తన తండ్రి చేసినట్లే పాదయాత్ర చేసి ప్రజల సమస్యలు తెలుసుకొని అత్యధిక మెజార్టీతో అత్యధిక సీట్లతో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీని ప్రపంచ చరిత్రలోనే రికార్డు సృష్టించిన వ్యక్తి అన్నారు.రానున్న రోజుల్లో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీని గెలిపించి జగన్మోహన్ రెడ్డి ముఖ్యమంత్రిగా చేసేవరకు నియోజకవర్గ ప్రజలతో పాటు తాను కష్టపడి పని చేయడానికి సిద్ధంగా ఉన్నానని అదీప్ రాజు అన్నారు .అంతకుముందు వైయస్సార్ పార్టీ నాయకులు గండి రవి కుమార్ మాట్లాడుతూ అధిష్టానం ఆదేశాల మేరకు యువత పోరు అనే కార్యక్రమం ద్వారా యువతకు అండదండగా నిలవడానికి వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ పోరాటం చేయడానికి ముందుకు వెళ్తుందని ఈ సందర్భంగా తెలియజేశారు.ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు శరగడం చిన అప్పలనాయుడు, సబ్బవరం సీనియర్ నాయకులు బోకం రామునాయుడు, బైలపూడి భగవాన్ జయరామ్, పాలిశెట్టి సురేష్ రాజ్, కొటాన రాము, సబ్బవరపు నారాయణమూర్తి , సబ్బవరపు ముత్యాల నాయుడు, దెద్దం ప్రసాదరావు ,ధనిమిరెడ్డి శ్రీనివాసరావు, వనం అచ్చం నాయుడు, కాపుశెట్టి శేషబాబు ,వడ్డాది అప్పలరాజు, పల్లా కృష్ణ ,ఎడ్ల నాయుడు, దెద్దం పద్మావతి, సబ్బవరపు నాగభూషణం, పి. రమేష్ నాయుడు సర్పంచులు ,ఎంపీటీసీలు, కార్యకర్తలు అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

నక్కపల్లి : మండలంలో బుధవారం పలు గ్రామాల్లో వైయస్సార్ పార్టీ 15వ

ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ మేరకు వైకాపా సీనియర్ నాయకులు వీసం రామకృష్ణ ఆధ్వర్యంలో నక్కపల్లి ఆర్టీసీ కాంప్లెక్స్ ఆవరణలో ఉన్న పార్టీ కార్యాలయం వద్ద జెండా ఎగరవేశారు. వైయస్సార్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కేక్ కట్ చేసి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

పాయకరావుపేట : ప్రజల్లోంచి పుట్టుకొచ్చిన పార్టీ వైఎస్ఆర్సిపి అని ఆ పార్టీ మండల అధ్యక్షులు చిక్కాల రామారావు అన్నారు. పార్టీ 15వ ఆవిర్భావ దినోత్సవం పాయకరావుపేటలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా దివంగత ముఖ్యమంత్రి వైయస్ రాజశేఖర్ రెడ్డి, రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. వైయస్సార్సీపి జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా చిక్కాల రామారావు మాట్లాడుతూ వైయస్సార్సీపి అధ్యక్షులు వైయస్ జగన్మోహన్ రెడ్డి రాష్ట్రవ్యాప్తంగా సంకల్ప యాత్ర చేసి, ప్రజల సమస్యలు తెలుసుకుని, మేనిఫెస్టోలో ప్రవేశపెట్టి, ప్రజల ఆశీర్వాదంతో ముఖ్యమంత్రి పదవి చేపట్టి ప్రజల ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కార దిశగా పరిపాలన చేశారన్నారు. దేశంలో ఏ పార్టీ కూడా ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను నెరవేర్చలేదన్నారు. ఇచ్చిన హామీలతో పాటు, మెరుగైన పథకాలు ప్రవేశపెట్టి రాష్ట్రాన్ని, రాష్ట్రంలోని ప్రజలను అభివృద్ధి బాటలోకి తీసుకువచ్చిన ఘనత వైయస్ జగన్మోహన్ రెడ్డికే దక్కుతుందని తెలిపారు. కూటమి ప్రభుత్వంలో విద్యార్థులకు ఫీజు రీయింబర్స్మెంట్ లేదని, నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు లేవని విమర్శించారు. ప్రభుత్వం వల్ల ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు పట్ల వైయస్సార్సీపి నిరంతర పోరాటం చేస్తుందని చిక్కాల రామారావు తెలిపారు. అనంతరం జిల్లా కలెక్టరేట్ వద్ద జరిగే యువత పోరు కార్యక్రమానికి నాయకులు, కార్యకర్తలు తరలి వెళ్లారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసి లంక సూర్యనారాయణ, ధనిశెట్టి బాబూరావు, దగ్గుపల్లి సాయిబాబా, జగతా శ్రీను, పట్టణ అధ్యక్షులు ధనిశెట్టి సత్య మహేష్, చోడిపిల్లి శ్రీనివాస్, సర్పంచులు కోడా కోటేశ్వరరావు, పన్నీరు పాపారావు, నాయకులు దేవవరపు

రాజేష్ ఖన్నా, చేపల తాతాజీ, ధనిశెట్టి బుజ్జి, రామాల శ్రీను, నెలపర్తి నాగరాజు, కేసనకుర్తి సత్తిబాబు, బొడ్డు హరిబాబు తదితరులు పాల్గొన్నారు.

అచ్యుతాపురం : వైసీపీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు బుధవారం అచ్యుతాపురంలో ఘనంగా నిర్వహించారు. ముందుగా పార్టీ ఆఫీస్లో మండల పార్టీ అధ్యక్షులు దేశంశెట్టి శంకరావు ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి తరువాత సెంటర్లో వైస్సార్ విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమం లో జడ్పీటీసీ లాలం రాము, నర్మల కుమార్, ఎంపీపీ కోన సంధ్య బుజ్జి, పిన్నంరాజు వాసు, కారుకుండి గంగూలీ శ్రీను,

సర్పంచ్లు కూండ్రపు విమలానాయుడు, రాజాన నాయుడుబాబు, ఎంపీటీసీ వాసుపల్లి శ్రీను, శ్రీరాములు, శనివాడ జువ్వలనాయుడు, కొమ్మోజు ఈశ్వరరావు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

యలమంచిలి : వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవ సందర్భంగా

బుధవారం నాడు యలమంచిలి పట్నంలో పార్టీ కార్యాలయం వద్ద పట్టణ పార్టీ అధ్యక్షులు బొద్ధపు ఎర్రయ్య దొర ఆధ్వర్యంలో పార్టీ జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వర్గీయ వైయస్ రాజశేఖర్ రెడ్డి ఆశయ సాధన కోసం, వైయస్ జగన్మోహన్ రెడ్డి ఈ పార్టీని స్థాపించారని, తక్కువ సమయంలోనే జగన్మోహన్ రెడ్డి ముఖ్యమంత్రిగా ప్రజలు ఎన్నుకొని, సుసంపన్నమైన పాలన పొందారని అన్నారు. ఈకార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ అర్రెపు గుప్తా, మండల పార్టీ అధ్యక్షులు కొల్లు త్రినాథ్,నాయకులు దాసరి కుమార్, కోడుగుడ్డు రమణ, కొటారు కొండబాబు, మండల సత్యనారాయణ, నర్సింగ్ రావు, పిల్లా త్రినాథ్, పడాల శ్రీను, కౌన్సిలర్లు, సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

శ్రీసీతారామ ఆలయ విగ్రహ ప్రతిష్ట మహోత్సవానికి కర్రి సాయికృష్ణకు ఆహ్వానం

విశాలాంధ్ర-మునగపాక: మండల కేంద్రమైన మునగపాక అంబేద్కర్ కాలనీలోని శ్రీసీతారామ ఆలయంలో ఈ నెల 15 నిర్వహించనున్న విగ్రహ ప్రతిష్ట మహోత్సవం సందర్భంగా ఈ పవిత్ర కార్యక్రమానికి తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి,శ్రీధర్మ ఫౌండేషన్ చైర్మన్ కర్రి సాయికృష్ణని ఆలయ కమిటీ సభ్యులు ఆహ్వానించారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు మునగపాక గ్రామ సర్పంచ్ దిమ్మల అప్పారావు,కోనపల్లి రామ్మోహన్ రావు,బీలా లక్ష్మణరావు తదితర సభ్యులు ఆయనను కలుసుకుని మహోత్సవ విశేషాలను వివరించారు.ఆలయ అభివృద్ధికి తమ సహాయ సహకారాలను అందించాలని కోరారు.ఈ సందర్భంగా కర్రి సాయికృష్ణ మునగపాక ప్రజలకు,భక్తులకు శుభాకాంక్షలు తెలియజేస్తూ,ధార్మిక సేవలకు ఎల్లప్పుడూ అండగా ఉంటామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

రహదారి విస్తరణకు అధికారులతో ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు సమావేశం

విశాలాంధ్ర-చోడవరం : బి.ఎన్.రహదారి విస్తరణకు చోడవరం ఎమ్మెల్యే కె.ఎస్.ఎన్.ఎస్. రాజు తన కార్యాలయంలో బుధవారం మండల అధికారుల సమావేశ మయ్యారు. పిపిటి పద్ధతిలో అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం నిర్ణయించిందని, ఇందుకు గాను సమగ్ర నివేదిక (డి.పి.ఆర్) తయారు చేసేందుకు ఎల్.ఇ.ఎ సంస్థ కు పని అప్పగించారు. రోలుగుంట మండలం వెలంకాయల గ్రామం నుంచి చోడవరం మండలం అడ్డూరు వరకు రెవెన్యూ అధికారులు ప్రభుత్వ భూమి ఎంత, ప్రైవేట్ భూమి ఎంత, ప్రవేట్ భూమి కి ఎంత, పునరావాసం ఎంత మందికి కల్పించాలి, నష్టపరిహారం ఎవరెవరికి ఇవ్వాలి, దెబ్బతినే కట్టడాలు వివరాలన్నీ సర్వే చేయించి సేకరించి ముందుగా నివేదికను సిద్ధం చేయాలని తహసిల్దారును ఎమ్మెల్యే ఆదేశించారు. రహదారి అభివృద్ధిలో భాగంగా విస్తరణకు ఊర్లో 80 అడుగులు, ఊరవతల వంద అడుగులు ఉండేలా సర్వే జరపాలని చెప్పారు. త్వరలోనే సంస్థ సర్వేకి వస్తుందని ఆయన చెప్పారు. ఈ సమావేశంలో చోడవరం బుచ్చియ్యపేట రావికమతం, రోలుగుంట తహశీల్దార్లు, ఎం.పీ.డీ.వో.లు, మండల స్థాయి అధికారులు, తదితరులు హాజరయ్యారు.

గోవాడ షుగర్ ఫ్యాక్టరీ సమస్యలపై సీ.ఎం కి సీ.పీ.ఎం లేఖ

విశాలాంధ్ర-చోడవరం : గోవాడ చక్కెర కర్మాగారంలో కార్మికులు కర్షకుల సమస్యలపై రాష్ట్ర ముఖ్యమంత్రికి ఓ లేఖ రాసినట్లు సిపిఎం నేతలు బుధవారం మీడియాకు తెలిపారు. ఈ నెల 10న కర్మాగారంలో పర్యటించిన సి.పి.ఎం. రాష్ట్ర కార్యదర్శి వి. శ్రీనివాసరావు తదితర కమ్యూనిస్టు నాయకులు రైతులు, కార్మికులు సమస్యలపై ఎం.డి తో చర్చించారు. ఫ్యాక్టరీ సమస్యలపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కు లేఖ వ్రాసారు. ఈ లేఖను చోడవరం లో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు డి. వెంకన్న, జిల్లా కమిటీ సభ్యులు వి వి శ్రీనివాసరావు, ఆర్ దేముడు నాయుడు, నాగిరెడ్డి సత్యనారాయణ లు విడుదల చేశారు. ఫ్యాక్టరీ క్రషింగ్ ప్రారంభించిన నప్పటినుండి తరచు ఆగిపోవడంతో ఫ్యాక్టరీ కి వచ్చిన చెరుకు ఎండలకు ఎండిపోయి రికవరీ, టన్నేజ్ రాక రైతులు నష్టపోతున్నారు. రాష్ట్రంలోనే సహకారంగంలో నడుస్తున్న గోవాడ షుగర్ ఫ్యాక్టరీని రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలని అన్నారు. రైతులు, కార్మికులు బకాయిలకై , ఆధునికరణకై ప్రభుత్వం తక్షణ సాయంగా 35 కోట్లు, ఆధునీకరణ కై 110 కోట్లు ఇవ్వాలని కోరారు. కేంద్ర మద్దతు ధరతో పాటు రాష్ట్ర సలహా ధర ఇక్కడ అమలు కాకపోవడంతో రైతులు రూ.500/- లు నష్ట పోతున్నారన్నారు. ఈఫ్యాక్టరీ లేకపోతే ఈ ప్రాంతంలో రైతులు, కార్మికులు రోడ్డున పడతారన్నారు.

సబ్బవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో యుడిసి అవినీతి ఆరోపణలపై విచారణ

విశాలాంధ్ర-సబ్బవరం: మండల కేంద్రంలోని స్థానిక సబ్బవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పనిచేస్తున్న సీనియర్ అసిస్టెంట్ పై వచ్చిన అవినీతి ఆరోపణలపై అనకాపల్లి జిల్లా ఇమినేషన్ అధికారి డాక్టర్ సి.హెచ్ చంద్రశేఖర్ మంగళవారం సబ్బవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యాధికారి ని సిబ్బంది అందరిని విచారణ జరిపారు . గతంలో సబ్బవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పనిచేసి మరణించిన జి మార్కు రాజు భార్య అయిన జి అరుణశ్రీ తన భర్త యొక్క పెన్షన్లు చనిపోయిన భూస్థాపిత ఖర్చులు నేటి వరకు డ్రా చేసి ఇవ్వలేదని రీజనల్ డైరెక్టర్ ఆఫ్ మెడికల్ అండ్ హెల్త్ సర్వీసెస్ విశాఖపట్నం వారికి ఫిర్యాదు చేయడంతో ఈ విచారణ చేపట్టడం జరిగింది ఈ విచారణలో భాగంగా సిబ్బందిని విచారించి వారి యొక్క వివరాలు తీసుకున్నారు.ఈ విచారణలో ఆరోపణలను ఎదుర్కొంటున్న ఉద్యోగికి కావాలని వైద్యాధికారి సెలవులు ఇచ్చారని పలు ఉద్యోగులు చెప్పుకుంటున్నారు ఈ విచారణ నుండి ఎలాగైనా యూ డిసి ను కాపాడాలని వైద్యాధికారి ఆపు సోఫాలు పడుతున్నారు అని ఉద్యోగులు చెవులు కోరుకొంటున్నారు. అలాగే ఈ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో యు డి సి వ్రాయవలసిన జీతాలు ఒక సూపర్ వైజరీ ఉద్యోగి రాస్తున్నాడని తెలిసి విచారణ అధికారి ఆ ఉద్యోగిని అడగ్గా ఇక్కడ నేను జీతాలు వ్రాయటం లేదు అని బిల్స్ స్కానింగ్ మాత్రమే చేస్తున్నాను అని చెప్పి చల్లగా జారుకున్నాడు కాని విచారణ జరిగిన మార్చి నెల జీతాలు ఇతనే రాస్తాడు అని ఉద్యోగులు అనుకుంటున్నారు ఎలాంటి విచారణ జరిగిన మమ్మల్ని ఎవరు ఏం చేయలేరని దిమాతో ఉన్నారు అని ఉద్యోగులు అనుకుంటున్నారు .ఈ విచారణ జరుగుతున్న సమయంలో కొంతమంది సిబ్బంది విచారణ అధికారి దగ్గరికి తమ గోడు చెప్పుకోవడానికి వస్తే వారిని విచారణ అధికారి దగ్గరికి వెళ్లకుండా వారిని వెనక్కి పంపించేశారని వారు ఆవేదన వ్యక్తం చేశారు.ఇంకా అనేక అక్రమాలపై ఈ పిహెచ్సిలో లోతుగా విచారణ జరిపితే అనేక అక్రమాలు బయటికి వస్తాయని ఉద్యోగులు అంటున్నారు ఈ విషయంపై విచారణ అధికారి డాక్టర్ చంద్రశేఖర్ గారిని ప్రెస్ వారు వివరణ కోరగా విచారణ జరుగుతుంది. విచారణ రిపోర్టు పై అధికారులకు పంపి తగు చర్యలు తీసుకుంటామని తెలియజేశారు.

విద్యార్థుల డ్రాప్ అవుట్ శాతాన్ని తగ్గించాలి

విశాలాంధ్ర-సబ్బవరం : మండలంలోని విద్యార్థుల డ్రాప్ అవుట్ శాతాన్ని తగ్గించాలని సమగ్ర శిక్ష జిల్లా అసిస్టెంట్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ ఆర్.జయప్రకాష్ కోరారు. మండల కేంద్రంలోని స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బుధవారం జరిగిన క్లస్టర్ స్కూల్ కాంప్లెక్స్ సమావేశానికి ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఎస్ సి ఈఆర్టీ నిర్దేశించిన అజెండా ప్రకారం పాఠశాలలో అమలవుతున్న తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల డ్రాప్ అవుట్ శాతాన్ని తగ్గించడంలో ఉపాధ్యాయులు బాధ్యత వహించి చర్యలు తీసుకోవాలని కోరారు.విద్యార్థుల డ్రాప్ అవుట్ నకు గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆరిపాక జడ్పీహెచ్ స్కూల్ ను సందర్శించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ-1ఎస్. లక్ష్మణరావు, ఎంఈఓ -2 రవీంద్రబాబు ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎస్. తిరుపతిరావు, సిఆర్పిలు, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

మద్యం దుకాణాలపై చర్యలు తీసుకోవాలి వినతి

విశాలాంధ్ర-పరవాడ : మండలంలో నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్న మద్యం దుకాణాలపై చర్యలు తీసుకోవాలని వైఎస్ఆర్సీపీ నాయకుడు మాసవరపు అప్పారావు డిమాండ్ చేసారు. బుదవారం ఆయన అనకాపల్లి జిల్లా ఎక్సైజ్ సూపరిండెంట్ను కలిసి వినతిపత్రం అందజేసారు. దుకాణాల నిర్వాహకులు సమయపాలన పాటించడం లేదని, అనుమతులు లేకపోయినా రూముల్లో మద్యం తాగిస్తూ బార్ అండ్ రెస్టారెంట్ల మాదిరిగా దుకాణాలను నడుపుతున్నారని, మద్యం దుకాణాల నిర్వాహకులే బెల్టు షాపులకు మద్యం సరఫరా చేస్తున్నారని పిర్యాదు చేసారు. ఇష్టానుసారంగా నడుతుపుతున్న మద్యం దుకాణాలపై చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా కోరారు.

నూతన ఆలయంలో తొలి రోజు గణపతి పూజలు

- పాల్గొన్న ఆడారి కుటుంబీకులు

విశాలాంధ్ర-యలమంచిలి : పట్నంలోని శ్రీ మహాగణపతి సహిత జ్ఞాన సరస్వతి సమేత శ్రీ సీతా రామచంద్ర స్వామి వారి దివ్య ప్రతిష్టా మహోత్సవంలో భాగంగా శ్రీ మహాగణపతి పూజ కార్యక్రమం నిర్వహించారు. బుధవారం తొలి రోజు కార్యక్రమంలో భాగంగా గణపతి పూజ తదితర ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో మున్సిపల్ చైర్ పర్సన్ పిల్లా రామకుమారి, విశాఖ డైరీ చైర్మన్ ఆడారి ఆనంద్ కుమార్ ల దంపతులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. విశాఖ డెయిరీ దివంగత చైర్మన్ ఆడారి తులసిరావు జ్ఞాపకార్థం విశాఖ డైరీ చైర్మన్ ఆడార ఆనంద్ కుమార్ ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహించ తలపెట్టిన ఈ కార్యక్రమం గురువారం విగ్రహ ప్రతిష్ట కార్యక్రమంతోపాటు ప్రత్యేక అభిషేక పూజా కార్యక్రమాలు నిర్వహించేలా భారీ ఏర్పాట్లు చేశారు. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

మండలంలో చురుగ్గా పి-4 సర్వే

విశాలాంధ్ర-పాయకరావుపేట : పాయకరావుపేట మండలంలో పి-4 సర్వే చురుగ్గా జరుగుతుంది. మండలంలో మొత్తం 27,732 ఇళ్ల వివరాలు సర్వే చేయాల్సి ఉండగా బుధవారం సాయంత్రానికి 8,427 ఇళ్ల వివరాలు నమోదు చేసి 30 శాతం సర్వే పూర్తి చేశారు. పాయకరావుపేట -1, గుంటపల్లి, నామవరం, వెంకటనగరం గ్రామాల్లో పి-4 సర్వే ముందంజలో ఉంది. గుంటపల్లి గ్రామంలో 67 శాతం సర్వే పూర్తి చేశారు. అలాగే శ్రీరాంపురం గ్రామంలో 1,136 ఇళ్లకు గాను 388 ఇళ్ళు సర్వే చేసి 34శాతం పూర్తి చేశారు. శ్రీరాంపురం గ్రామంలో జరిగిన సర్వేలో పంచాయితీ కార్యదర్శి వై. సత్యనారాయణ, వెల్ఫేర్ అసిస్టెంట్ పింతే వినయ్ కుమార్, మహిళా పోలీస్ ఎం.డి. నూర్ సుల్తానా. ఫిషరీస్ అసిస్టెంట్ ప్రియాంక, ఏఎన్ఎం కుమారి, ఇంజనీరింగ్ అసిస్టెంట్ సతీష్ తదితరులు పాల్గొన్నారు.